సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం ; 31 ; అక్టోబర్ ; 2024



వెలుగుల కేళి..దీపావళి



జిల్లా వ్యాప్తంగా దీపావళి శోభ సంతరించుకుంది. వెలుగుల పండుగను గురువారం ఘనంగా జరుపుకునేందుకు అందరూ సిద్ధమయ్యారు. బాణాసంచా, బొమ్మలు, పూల కొనుగోలుతో బుధవారం మార్కెట్లన్నీ సందడిగా మారాయి. లక్ష్మీబాంబు ఒక్కోటి రూ.15 నుంచి రూ.40, చిచ్చుబుడ్డి ప్యాకెట్ సైజ్‌లను బట్టి రూ.350 నుంచి రూ. 600 వరకు ఉన్నాయి. అయితే టపాసుల ధరలు భారీగా ఉండడంతో కొందరు మార్కెట్‌కు వచ్చినా ఆశించిన మేర కొనుగోలు చేయలేకపోయారు. ఇక నేడు లక్ష్మీపూజలు ఘనంగా జరుపుకునేందుకు మహిళలు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. – కొత్తగూడెం టౌన్





ప్రకాశం స్టేడియంలో బాణాసంచా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు (ఇన్‌సెట్) ప్రమిదలు, పూల కొనుగోళ్లతో సూపర్‌బజార్ సెంటర్‌లో కోలాహలం

న్యూస్‌రీల్

కమనీయంగా కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా రుద్రహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. ఆలయంలో యాగశాలకు స్వామి వారిని తీసుకొచ్చాక మండపారాధన, గణపతిపూజ, రుద్రహోమం నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు. వేద పండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, అమ్మవారిని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

కలెక్టర్, ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ప్రజలంతా ఆనందోత్సాహాలతో దీపావళి పండుగ జరుపుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. బాణాసంచా కాల్చడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

2 నుంచి 'కార్తీక' పూజలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం (శివాలయం)లో కార్తీక మాసం సందర్భంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు, సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బి.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 4న మొదటి సోమవారం స్వామివారికి భస్మాభిషేకం, జ్యోతిర్లింగార్చన, ఆకాశదీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కార్తీక మాస రెండో సోమవారం 11వ తేదీన చందనోత్సవం, జ్యోతిర్లింగ దీపోత్సవం, 15న రుద్రాభిషేకం, జ్వాలా తోరణోత్సవం, 17న స్వామివారి కల్యాణం, 18న పుష్పోత్సవం, మహా నివేదన, ఆకాశ దీపోత్సవం, 25న మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, 27న నదీ హారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు నలుగురు జీఎంల ఉద్యోగ విరమణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని వివిధ ఏరియాల్లో పని చేస్తున్న నలుగురు జీఎంలు గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. అందులో ఒకరైన పర్సనల్ జీఎం శామ్యూల్ సుధాకర్‌ను స్థానిక కార్పొరేట్ కార్యాలయంలో మాజీ సీపీపీ జీఎం జక్కం రమేష్ బుధవారం సన్మానించారు.

పోస్టల్ ఏఎస్పీ విచారణ

దుమ్ముగూడెం : మండలంలోని సీతారాంపురంలో రిజిస్టర్డ్ లెటర్లు రోడ్డున పడేసిన ఘటనపై తపాలా శాఖ భద్రాచలం ఏఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. సీతారాంపురం పోస్టాఫీస్ పరిధిలోని కె.దంతెనం గ్రామానికి చెందిన ప్రజల ఏటీఎం, పాన్ కార్డులు లక్ష్మీనగరం గ్రామంలో రోడ్డుపై పడిపోగా ఓ బాటసారికి దొరికాయి. వాటిని ఆ వ్యక్తి బ్యాంకు సిబ్బందికి అందజేయడంపై మంగళవారం పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో స్పందించిన ఏఎస్పీ విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం నివేదికను బట్టి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనుగోళ్లకు సిద్ధం



పాల్వంచలో కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం (ఫైల్)

ధాన్యం సేకరణకు అధికారుల ప్రణాళికలు

- 20 మండలాల్లో 160 కేంద్రాల ద్వారా కొనుగోలు
- నాలుగు ఏజెన్సీల ఆధ్వర్యంలో నిర్వహణ
- ఈ వారంలో కేంద్రాల ఏర్పాటుకు అవకాశం..

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం ధాన్యం కొనుగోలుకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం సన్నాహక సమావేశాలు నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. ధాన్యం తూకంలో తేడా రాకుండా యంత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయనున్నారు. గ్రేడ్–ఏ రకం ధ్యానం క్వింటాకు మద్దతు ధర రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300గా నిర్ణయించారు. సన్నరకం ధాన్యానికి అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనుండగా, అవి నేరుగా రైతుల ఖాతాలో జమవుతాయని అధికారులు వెల్లడించారు.

రెండు రకాలు కలవకుండా..

కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యం కలవకుండా అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. సన్నరకం ధాన్యం సంచులకు ఎరుపు రంగు దారంతో కుట్టి 'ఎస్' అనే అక్షరం రాయనున్నారు. దొడ్డు రకం ధాన్యం సంచులను పచ్చరంగు దారంతో కుడతారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులు, గోడౌన్లకు తరలించిన తర్వాత కూడా అవి ఏ ప్రాంతం నుంచి వచ్చాయో గుర్తించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రానికి సన్న ధాన్యాన్ని గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ యంత్రాలు, ధాన్యాన్ని శుభ్రం చేసేందుకు ప్యాడీహస్కర్ యంత్రాలను అందజేస్తారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు. వర్షం కురిస్తే కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు తలెత్తకుండా టార్పాలిన్లను సైతం సిద్ధం చేస్తున్నారు. ధాన్యంలో తేమను గుర్తించేందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఇలా..

ధాన్యం కొనుగోలుకు 20 మండలాల పరిధిలో 160 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అవి ఏయే గ్రామాల్లో ప్రారంభించాలనే దానిపై అధికారులు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారు. జిల్లాలో నాలుగు ఏజన్సీల ద్వారా 160 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా పీఏసీఎస్‌కు 117, జీసీసీకి 30, డీఆర్‌డీఏకు 3, డీసీఎంఎస్‌కు 10 కేంద్రాలను కేటాయించారు. వీటితో పాటు డిమాండ్ పెరిగితే మరికొన్ని కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అశ్వాపురం మండలంలో అత్యధికంగా 16 కొనుగోలు కేంద్రాలు, అత్యల్పంగా ఆళ్లపల్లి మండలంలో కేవలం రెండు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నవంబర్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఏజెన్సీల నిర్వాహకులు, ఏఓలు, ఏఈఓలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సన్నరకం ధాన్యాన్ని గుర్తించే యంత్రాల వినియోగంపై పౌరసరఫరాల శాఖ అధికారులకు శిక్షణ ఇస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే 20 మండలాల్లో కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాం. కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేస్తాం. సన్న రకాలు, తేమను గుర్తించేందుకు ప్రతీ కేంద్రానికి ఒక యంత్రం అందజేస్తాం. ఆ యంత్రం వినియోగంపై అధికారులు ఆయా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

– త్రినాథ్‌బాబు, పౌరసరఫరాల శాఖ డీఎం

సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 6 నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సర్వే చేయాల్సిన తీరుపై జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మండల స్టాటిస్టికల్ అధికారులు, ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమం లక్షల మంది జీవితాల్లో మార్పు తీసుకొస్తుందని, అధికారులు వివరాలను సేకరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు సేకరించాలని సూచించారు. ప్రజల జీవన స్థితిగతులను తెలుసుకునేందుకే ప్రభుత్వం ఈ సర్వే చేపడుతుందని చెప్పారు. ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కారాలు గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సర్వే పూర్తయిన తర్వాత వివరాలు నింపిన స్టిక్కర్‌ను ఇంటి గోడపై అతికించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు వేణుగోపాల్, విద్యాచందన, జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, సీపీఓ సంజీవరావు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

బూర్గంపాడు: ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. కృష్ణసాగర్ ప్రభుత్వ గిరిజన గురుకుల కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై బోధన, తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు క్విజ్ పోటీల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో భోజనం అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. బోధన సమయంలో ఏమైనా సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు చెప్పారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అనంతరం అధ్యాపకుల బోధన తీరును పరిశీలించారు. కళాశాల, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులు రాత్రి పూట బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అశోక్‌కుమార్, విజయబాబు, హర్ష తదితరులు పాల్గొన్నారు.



కృష్ణసాగర్ కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న పీఓ రాహుల్

అభ్యర్థుల అభ్యంతరాల స్వీకరణ..

భద్రాచలంటౌన్: ఖమ్మం రీజియన్‌లో గల గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్ పోస్టుల నియామకానికి స్వీకరించిన దరఖాస్తుల్లో అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరించనున్నట్లు పీఓ రాహుల్ తెలిపారు. తాత్కాలిక ప్రావిజినల్ జాబితాను ప్రదర్శిస్తామని, అభ్యర్థులు తమ అభ్యంతరాలను నవంబర్ 1, 2 తేదీల్లో ఖమ్మం రీజనల్ అధికారి కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు, నాయకులు

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో పాటు వైరా, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న రంగారెడ్డి జిల్లా జట్టుకు రూ.75వేలు, ద్వితీయ బహుమతి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు రూ.60 వేలు అందజేశారు. మహిళా విభాగంలో నల్లగొండ జిల్లా జట్టు ప్రథమస్థానంలో నిలవగా రూ.75 వేలు, రెండో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టుకు రూ.60 వేలు అందించారు. మూడోస్థానంలో ఖమ్మం జిల్లా జట్టుకు మెమెంటో అందించారు. కాగా, రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 16 జట్లు హాజరు కాగా, అందరికీ నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, చీకటి కార్తీక్, ఆళ్ల మురళి, నాగా సీతారాములు, తూము చౌదరి, కంచర్ల చంద్రశేఖర్‌రావు, జేవీఎస్ చౌదరి, మండె వీర హన్మంతరావు, కోనేరు చిన్ని పాల్గొన్నారు.

రసాభాసగా రైతుల సమావేశం

చర్ల: తాలిపేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమావేశం బుధవారం రసాభాసగా సాగింది. తమ జోన్లకు నీరివ్వాలంటూ ఇరువర్గాల రైతులు వాగ్వాదానికి దిగారు. మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పరిధిలో గల చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులకు ఏటా ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరు విడుదల చేస్తున్నారు. అయితే ఖరీఫ్‌లో రెండు మండలాల పరిధిలోని 24,700 ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తుండగా, రబీలో రొటేషన్ పద్ధతిలో ఏటా ఒక జోన్‌కు చొప్పున అందిస్తున్నారు. అయితే గతేడాది రబీలో రెండో జోన్‌కు నీరు విడుదల చేయాల్సి ఉండగా, కాలువలు, ప్రాజెక్టు మరమ్మతు పనుల కోసం నీరు సరఫరా చేయడం లేదని అధికారులు ప్రకటించారు. అయితే ఎన్నికల కోడ్‌తో నిధులు రాక మరమ్మతులు చేపట్టకున్నా రెండో జోన్‌కు నీరందించలేదు. అయితే ఈ ఏడాది రొటేషన్ పద్ధతి ప్రకారం తమకే నీరు విడుదల చేయాలని మూడో జోన్ రైతులు, గతేడాది నీరివ్వనందున ఇప్పుడు తమకు కేటాయించాలని రెండో జోన్ రైతులు డిమాండ్ చేశారు. అయితే ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు జోక్యం చేసుకుని గతేడాది రెండో జోన్‌కు నీరు నిలిపినందున ఈ సంవత్సరం రబీలో రెండో జోన్‌కు ఇవ్వడమే సరైందని, అందుకు అందరూ సహకరించాలని కోరడంతో రైతులు శాంతించారు. కాగా, మార్చి 31 వరకు మాత్రమే నీరు విడుదల చేస్తామని, రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని ఇరిగేషన్ అధికారులు సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డీఈ మధుసూదన్‌రావు, ఏఈలు ఉపేందర్, ఏఈఓ కీర్తి తదితరులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన రైతులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

బీటీపీఎస్‌లో పోస్టులు భర్తీ చేయాలి

మణుగూరు రూరల్: మండలంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు కేటాయించిన పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ టీఎస్‌పీఈయూ – 1535 ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధలో జెన్‌కో డైరెక్టర్ అజయ్‌కి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ మాట్లాడుతూ.. బీటీపీఎస్‌కు మంజూరైన పోస్టులు భర్తీ చేయకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, అర్హులైన వారు పదోన్నతి పొందలేకపోతున్నారని వివరించారు. బీటీపీఎస్ భూ నిర్వాసిత ఉద్యోగులు సైతం పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీటీపీఎస్ రీజినల్ అధ్యక్షుడు వి ప్రసాద్, నాయకులు ఆర్.రవిచంద్ర, ఎన్. సాంబ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

ఇందిరమ్మ కమిటీల నియామకాలపై కాంగ్రెస్ వాదుల అసంతృప్తి

దుమ్ముగూడెం : భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు వ్యతిరేకంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఫ్లెక్సీలు వెలిశాయి. ఇందిరమ్మ కమిటీల్లో అసలైన కాంగ్రెస్ వాదులకు చోటు కల్పించకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం కల్పించారంటూ ఫ్లెక్సీల్లో కార్టూన్ రూపంలో చిత్రాలు ముద్రించారు. ఈ ఫ్లెక్సీలను కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం వారు ఏర్పాటు చేశారనే ప్రచారం సాగుతోంది. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో నిజమైన కాంగ్రెస్ వాదులకు చోటు కల్పించలేదంటూ రెండు రోజుల క్రితం డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి చైర్మన్ పొదెం వీరయ్యకు మండల కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. కాగా, ఎమ్మెల్యే వెంకట్రావు సొంత మండలంలోనే ఆయనకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటుకావడం గమనార్హం.



ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు వ్యతిరేకంగా వెలిసిన ఫ్లెక్సీ



ఉద్యోగం ఇప్పిస్తానని లంచం తీసుకున్న అధికారి !


విచారణ చేస్తున్న డీడబ్ల్యూఓ స్వర్ణలత

గుండాల: అనారోగ్యంతో కొద్ది రోజులు ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్న అంగన్‌వాడీ టీచర్ నుంచి తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఓ అధికారి రూ.1.50 లక్షలు లంచం తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని కోనవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న టీచర్ ధనమ్మ రెండేళ్ల కిందట అనారోగ్యం, ఇతర కారణాలతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి విధులకు హాజరుకావడం లేదు. అనంతరం రాజీనామా చేసినా ఆమోదం పొందలేదని సమాచారం. కాగా, ఇటీవల మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశారు. తన పేరు తొలగించలేదని తెలుసుకున్న ధనమ్మ ఏడాది కాలంగా ఉద్యోగం తనకు కావాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతోంది. ఇదే అదనుగా భావించిన ఓ అధికారి రూ.1.50 లక్షలు లంచంగా తీసుకున్నాడు. తిరిగి ఉద్యోగం ఇవ్వకపోవడంతో బాధితురాలు ప్రజావాణిలో వినతిపత్రం అందించింది. దీంతో బాధితురాలికి రూ.50 వేల చొప్పున రెండు దఫాలుగా రూ.లక్ష ఫోన్‌పే ద్వారా సదరు అధికారి చెల్లించినట్లు తెలిపింది. అయితే, ఆ అంగన్‌వాడీ సెంటర్‌ను గుండాల–2 కేంద్రంలో కొనసాగిస్తున్నారు. ఏడాది నుంచి గ్యాస్, కూరగాయల బిల్లులకు సంబంధించి ధనమ్మ ఖాతాలోనే డబ్బులు జమ అవుతుండటం గమనార్హం. బాధితురాలిని తొలగిస్తే ఆన్‌లైన్ పేమెంట్ కూడా నిలిపివేయాలి. కానీ, కోనవారిగూడెం సెంటర్‌లో పోస్టు ఖాళీ చూపించకుండానే బిల్లులు వేయడం.. జిల్లా అధికారులకు సైతం తెలియక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, బుధవారం సందర్శన నిమిత్తం ఇక్కడికి వచ్చిన డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనాకు ధనమ్మ విషయం తెలిపింది. ఆరోగ్యం బాగాలేక కొన్ని రోజులు హాజరుకాలేదని, ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడిందని, కుటుంబ పోషణ కోసం తనకు ఉద్యోగం కావాలని కోరింది. స్పందించిన డీడబ్ల్యూఓ సీడీపీఓతో పాటు ధనమ్మ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డీడబ్ల్యూఓ తెలిపారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటులో దందా

- ఇద్దరు వ్యక్తులు రూ.లక్షల్లో దండుకున్నట్లు ఆరోపణ
- పట్టించుకోని అధికారులు


అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

అశ్వారావుపేట: దీపావళి బాణసంచా దుకాణాల నుంచి ఫార్మాలిటీస్ పేరుతో ఇద్దరు వ్యక్తులు రూ.3 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అశ్వారావుపేటలో 10 దుకాణాలు ఏర్పాటు చేయగా.. ఒక్కో దుకాణం నుంచి రూ.30 వేలు వసూలు చేసి అందరికీ లైసెన్స్‌లు ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు అంతా మేనేజ్ చేసినట్లు సమాచారం. ముద్రిత లైసెన్స్‌లు ఇవ్వకుండా వాట్సప్ ద్వారా లైసెన్స్ ఫొటోలను దుకాణదారులకు పంపించారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ శాఖాధికారులకు ముడుపులు చెల్లించాలని.. లైసెన్స్ ఫీజుతో కలిపి ఒక్కో దుకాణానికి రూ.30 వేలు చొప్పున వసూలు చేశారు. ముందుగా ముడుపులు చెల్లించడంతో దుకాణాల వద్ద సురక్షిత ఏర్పాట్లు ఉన్నాయా? లేవా అనే తనిఖీలు లేకుండా పోయాయి. పది దుకాణాలను వరుసగా ఒకదానికి ఒకటి ఆనించి నిర్మించారు. దుకాణాల మధ్య ఖాళీ ఉండాల్సి ఉండగా అన్నింటినీ కలిపి వరుసగా ఏర్పాటు చేశారు. నీళ్లు, ఇసుక డ్రమ్ములు, బకెట్‌లు ఉంచాల్సి ఉండగా నామమాత్రంగా ఏర్పాటు చేశారు. దుకాణాల ఆవరణలో బాలకార్మికులను ఉంచి తమ దుకాణానికి రావాలంటూ వినియోగదారులను ఆకర్షించేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఒక్కో లైసెన్స్‌కు 100 కిలోలకు మించకుండా క్రాకర్స్, 500 కిలోలకు మించకుండా చైనీస్ క్రాకర్స్, స్పార్కింగ్ వస్తువులు ఉండాలి. కానీ, పరిమితికి మించి సామగ్రి నింపేశారు. టపాసుల ధరల పట్టిక కూడా కనీసం ఒక్క దుకాణం వద్ద సైతం ఏర్పాటు చేయలేదు. అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడటం లేదు.






ఏపీజీవీబీలో వివాదం..!

ములకలపల్లి: స్థానిక ఏపీజీవీబీలో నెలకొన్న వివాదం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మేనేజర్‌కు ఖాతాదారులకు మధ్య మొదలైన వాగ్వాదం ఇరుపక్షాల మధ్య తోపులాటకు దారితీసింది. చిలికిచిలికి గాలివానలా మారినప్పటికీ ఇరుపక్షాలు రాజీ పడడంతో సమసిపోయింది. మండలంలోని ఓ ఖాతాదారుడికి సంబంధించి 'ఓవర్ డ్యూ' అంశం, ఓ మృతురాలి అకౌంట్‌లోని నగదు చెల్లింపుల విషయమై ఏపీజీవీబీ మేనేజర్ మహేశ్.. బాధితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా.. బ్యాంకుకు వచ్చిన పలువురు ఖాతాదారులు వాదనకు దిగి, దాడికి యత్నించినట్లు విశ్వసనీయ సమాచారం. అడ్డువచ్చిన బ్యాంకు సిబ్బందికి ఖాతాదారులకు మధ్య తోపులాట జరగడమే కాకుండా మేనేజర్ మహేశ్‌తోపాటు మరో ఉద్యోగిపై చేయి చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు బ్యాంక్‌కు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు లిఖితపూర్వక ఫిర్యాదులు సమర్పించేందుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రాత్రి వరకు జరిగిన చర్చలు సఫలం కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. మేనేజర్ మహేశ్‌ను వివరణ కోరగా.. బ్యాంకు రుణాల అంశంలో మధ్యవర్తుల ప్రమేయాన్ని నిరోధించడంతో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. ఇరుపక్షాలు రాజీ పడటంతో ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో విచారణ

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్ ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ వేధింపులు తాళలేక మంగళవారం విధులు బహిష్కరించి హాస్టల్ ఎదుట వర్కర్లు బైఠాయించిన విషయం విదితమే. బుధవారం ఏఎస్‌డబ్ల్యూఓ హనుమంతరావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. హాస్టల్ విద్యార్థులను విచారించడంతో పాటు వంట సిబ్బందిని పలు విధాలుగా ప్రశ్నించారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో ఉండకుండా సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విచారణలో తేలింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులకు తాళాలు ఇస్తూ అందుబాటులో ఉండకుండా వార్డెన్ ఇష్టానుసారంగా వ్యవహరించడంతో పాటు సంవత్సరాలుగా పనిచేస్తున్న వంట సిబ్బందిని కూడా వేధింపులకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని సిబ్బందితో రాతపూర్వక ఫిర్యాదు తీసుకున్నామని నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.









రేడియం స్టిక్కర్లతో ప్రమాదాలకు చెక్


కటౌట్ల వద్ద ఎస్‌ఐ గంజి స్వప్న

చండ్రుగొండ: మండల కేంద్రం శివారు అయన్నపాలెంలో జాతీయ రహదారి మలుపు వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతుండగా.. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు క్షతగాత్రులుగా మిగిలారు. ఇటీవల ఓ లారీ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మరణించాడు. దీంతో ఎస్‌ఐ గంజి స్వప్న ఆధ్వర్యంలో పోలీసులు.. ఓ కారు.. పక్కనే కానిస్టేబుల్ నిల్చున్నట్లు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. అటువైపు నుంచి వచ్చే వాహనదారులకు ఇక్కడ కానిస్టేబుల్ ఉన్నట్లు కనిపిస్తుంది.





గుండాలలో దొంగల హల్‌చల్

గుండాల: మండల కేంద్రంలో అర్ధరాత్రి దొంగలు పలు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఆటోలో వచ్చిన వ్యక్తులు ముందుగా స్థానిక సెంటర్‌లో ఉన్న మణికంఠ జ్యుయలరీ షాపు తలుపులు, తాళాలు తీసి లోపల కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.లక్ష విలువ చేసే కేజీ వెండి నగలను అపహరించారు. బయట, లోపల ఉన్న సీసీ కెమెరాలను తొలగించారు. పక్కన ఉన్న మరో జ్యుయలరీ షాపు బయట ఉన్న సీసీ కెమెరాను సైతం పైకి తిప్పారు. అనంతరం స్థానిక రామాయలంలోకి గోడలపై నుంచి దూకి హుండీ తాళం పగులగొట్టి కొంత నగదును తీసుకెళ్లారు. బుధవారం తెల్లవారుజామున షాపునకు వచ్చిన యజమాని తలుపులు తీసి ఉండడాన్ని చూసి దొంగలు పడ్డారని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజమౌళి చోరీ జరిగిన షాపుతో పాటు రామాలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీం అధికారులు డాగ్ స్క్వాడ్‌తో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.









క్లుప్తంగా...

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ నియంత్రణ్ భవన్‌లోని ఈ ఆర్సీ కార్యాలయంలో ఆయనతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జస్టిస్ దేవరాజు నాగార్జున్ మాట్లాడుతూ వినియోగ దారులు, విద్యుత్ సంస్థల ప్రయోజనాలను కాపాడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తదితరులు పాల్గొన్నారు. మరో ఇద్దరు ఈఆర్సీ సభ్యుల నియామకానికి ప్రభుత్వం త్వరలో ప్రకటన జారీ చేయనుంది.

చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు బెదిరింపు కాల్

- రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్

కొత్తపల్లి (కరీంనగర్): కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశామని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకట రమణ తెలిపారు. ఎమ్మెల్యే సత్యంకు ఈ నెల 28న మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గుర్తు తెలియని నంబరు +447886696497 నుంచి వాట్సాప్ కాల్ వచ్చిందని వెల్లడించారు. ఫోన్‌లో సదరు వ్యక్తి మాట్లాడుతూ తనకు రూ.20 లక్షలు చెల్లించాలని, లేదంటే రాజకీయంగా అప్రతిష్టపాలు చేసి తన ఇద్దరు పిల్లలు అనాథలయ్యేలా చేస్తానని బెదిరింపులకు గురిచేసినట్లు తెలిపారు. దీంతో సత్యం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈమేరకు 339/ 2024, భారతీయ న్యాయ సంహిత 308, 351 (3), (4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. నిందితుడు రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌లోని భవానీనగర్‌కి చెందిన యాస అఖిలేశ్‌రెడ్డి (33) అని, ఇతడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నాడని, అక్కడి నుంచి బెదిరింపులకు పాల్పడ్డట్లు తేలిందని వివరించారు. సదరు నిందితుడిపై బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీచేశామని ఏసీపీ వెల్లడించారు.

మెడికల్ పీజీ కోర్సులకు నేటి నుంచే దరఖాస్తులు

- అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ వర్సిటీ
- దరఖాస్తులు ముగిశాక దశలవారీగా కౌన్సెలింగ్
- అల్లోపతి, ఆయుర్వేద, హోమియో కోర్సులకు అడ్మిషన్లు
- జాతీయ కోటా పోగా మిగతా సీట్లన్నీ తెలంగాణ వాసులకే..
- నిబంధనలు, అర్హత వివరాలను వెల్లడించిన విశ్వవిద్యాలయం
- ఆయుర్వేద, హోమియో, యునాని ఎండీ కోర్సుల్లో ప్రవేశాలకూ నోటిఫికేషన్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎట్టకేలకు మెడికల్ పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 2024–25 సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎండీ, ఎంఎస్, డిప్లొమా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. కాళోజీ వర్సిటీకి, నిమ్స్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో దీనిద్వారా సీట్లను భర్తీ చేస్తారు. నీట్ పీజీ–2024లో అర్హత పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో గురువారం (31–10–2024) ఉదయం 6 గంటల నుంచి వచ్చే నెల ఏడో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. స్కాన్‌చేసిన సర్టిఫికెట్లను https://tspgmed.tsche.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. రాష్ట్ర స్థాయి మెరిట్‌ను నిర్ణయించి కన్వీనర్ కోటా అడ్మిషన్లను చేపడతారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన అన్ని సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాత.. తాత్కాలిక తుది మెరిట్ జాబితా ప్రదర్శిస్తారు. పీజీ మెడికల్ కోర్సుల కోసం నీట్ పీజీ–2024 పరీక్షలో కటాఫ్ స్కోర్‌గా.. ఓపెన్ కేటగిరీకి 50 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40 పర్సంటైల్, ఓసీల్లో వైకల్యం ఉన్నవారికి 45 పర్సంటైల్‌ను ఖరారు చేశారు. కాగా.. ఎండీ ఆయుర్వేద, హోమియో, యునాని కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నోటిఫికేషన్లు జారీచేశారు. వాటికి బుధవారం సాయంత్రం 4 గంటల నుంచే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే నెల ఐదో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఏపీజీఈటీ–2024 పరీక్షలో అర్హత సాధించినవారు ఈ మూడు కోర్సుల్లో చేరేందుకు అర్హులు.

నోటిఫికేషన్‌లోని ముఖ్యాంశాలివీ..

- అభ్యర్థులు స్థానికులై ఉండాలి. అంటే ఇప్పటివరకు వరుసగా నాలుగు సంవత్సరాలకు తక్కువ కాకుండా తెలంగాణలో చదివి ఉండాలి. అలాగే విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో చదివిన తెలంగాణ విద్యార్థులను కూడా ఇక్కడి స్థానికులుగానే భావిస్తారు.
- తెలంగాణలో ఇప్పటివరకు అంచనా వేసిన ప్రకారం.. 26 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 2,800 పీజీ మెడికల్ సీట్లున్నాయి. అందులో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లలో 50శాతం జాతీయ కోటా కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. మిగతా సీట్లను తెలంగాణ స్థానికులకు కేటాయిస్తారు.
- తెలంగాణలో స్థానికేతర కోటా కింద ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులకు స్థానికత వర్తించదు.
- ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి, లేదా అంతకుముందే ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి.
- ఇన్–సర్వీస్ కోటా అభ్యర్థుల విషయంలో.. ప్రభుత్వంలో వారు చేసిన ఉద్యోగాన్ని గత నెల 30వ తేదీ వరకు పరిగణనలోకి తీసుకుంటారు.
- ఇతర రాష్ట్రాల అభ్యర్థులు కన్వీనర్ కోటా సీట్లకు అర్హులు కారు.
- పీజీ, డిప్లొమా కోర్సులకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు కలిపి ఓసీ, బీసీలు రూ.5,500, ఎస్టీలు రూ.5 వేలు చెల్లించాలి.
- ఆయా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన వెబ్ ఆప్షన్ల తేదీలను త్వరలో వెబ్‌సైట్లో వెల్లడిస్తారు.
- నీట్ పీజీ పరీక్షలో కటాఫ్ స్కోర్ కంటే ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
- దరఖాస్తుల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే.. 9392685856, 7842136688, 9059672216 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. లేదా knrpgadmissions@gmail.com కు ఈ–మెయిల్ చేయవచ్చు.



నల్లగొండ పట్టణ పరిధిలో జలమయమైన ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రం

వర్షపు నీటిలో ధాన్యపు రాశులు

రామన్నపేట/నల్లగొండ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా, నల్లగొండ జిల్లా బుధవారం కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం తడిసిపోయింది. భువనగిరి జిల్లా రామన్న పేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. రామన్నపేట వ్యవసాయమార్కెట్‌లో సీసీ ప్లాట్‌ఫారంపై పోసిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. ఇక నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలో కురిసిన భారీ వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఆర్జాల బావిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం జలమయమైంది. ఖాజీరామారం, కొత్తపల్లి సెంటర్లలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పినప్పటికి గాలి, ధాన్యం బస్తాల కిందకు వర్షపు నీరు చేరి తడిశాయి. ధాన్యపు రాసుల మధ్య చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు రాత్రి సమయంలో తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

మయోనైజ్‌పై నిషేధం

▶ మొదటి పేజీ తరువాయి

వాటితో కూడా కలిపి తీసుకుంటుంటారు.

మంత్రి సమీక్ష నేపథ్యంలో.. : ఆహార భద్రతపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం సమీక్ష నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీల పనితీరుపై ఆరా తీశారు. 235 హోటళ్లు, హాస్టళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, గోడౌన్లలో తనిఖీలు చేశామని, 170 సంస్థలకు నోటీసులు ఇచ్చామని జీహెచ్‌ఎంసీ టాస్క్‌ఫోర్స్ అధికారులు వివరించారు. దీంతో జిల్లాల్లోనూ విరివిగా తనిఖీలు చేయాలని, ఇందుకోసం రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించాలని మంత్రి సూచించారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మోమోస్ తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై మంత్రి ఆరా తీశారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో కలిపి తినే మయోనైజ్‌ను కల్తీ గుడ్లు, ఉడకబెట్టని గుడ్లతో తయారు చేస్తున్నారని, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని అధికారులు వివరించారు. మయోనైజ్ క్వాలిటీ, అది తిన్న తర్వాత కలిగిన దుష్పరిణామాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కేరళలో ఈ తరహా మయోనైజ్ తయారీని అక్కడి ప్రభుత్వం నిషేధించిందని, రాష్ట్రంలో కూడా నిషేధం విధించాలని సూచించారు. దీంతో పలువురు డాక్టర్లు, ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి.. మయోనైజ్‌పై నిషేధం విధించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఆహార భద్రతపై అధ్యయనం చేయండి

రాష్ట్రంలో గత పదేళ్లలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, హాస్టళ్ల సంఖ్య భారీగా పెరిగిందని, ఇందుకు అనుగుణంగా ఆహార భద్రతా విభాగం బలోపేతం కాలేదని, కొత్త పోస్టులు మంజూరు కాలేదని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో ఫుడ్ సేఫ్టీలో ముందున్న రాష్ట్రాలు, దేశాల్లో అవలంబిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా మంత్రి అధికారులను ఆదేశించారు. కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయబోతున్నామని, 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు కలెక్టరేట్లలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కర్ణన్, డైరెక్టర్ శివలీల, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు మూర్తి రాజు, అమృత, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ నాయుడుకు టీటీడీ చైర్మన్ పదవి

సాక్షి, అమరావతి/హైదరాబాద్: టీవీ–5 అధినేత బీఆర్ నాయుడికి చంద్రబాబు టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఆయనతోపాటు మరో 23 మందిని సభ్యులుగా నియమిస్తున్నట్లు బుధవారం టీడీపీ ప్రకటించింది. సభ్యులుగా జగ్గంపేట, కోవూరు, మడకశిర ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంఎస్ రాజు, టీడీపీ నేత పనబాక లక్ష్మి, సాంబశివరావు (జాస్తి శివ), నన్నపనేని సదాశివరావు, కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, శాంతారాం, పి.రామ్మూర్తి, తమ్మిశెట్టి జానకీదేవి, నరేశ్ కుమార్ నియమితులయ్యారు. తెలంగాణ నుంచి నల్లగొండకు చెందిన టీడీపీ నేత నన్నూరి నర్సిరెడ్డి, జనసేన పార్టీ నేత బుంగునూరు మహేందర్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణంలో ఆర్కిటెక్ట్‌గా వ్యవహరించిన బురగపు ఆనంద్‌సాయి, భారత్ బయోటెక్ కో చైర్మన్ సుచిత్ర ఎల్లా, అనుగోలు రంగశ్రీకి అవకాశం ఇచ్చారు. కర్ణాటక నుంచి జస్టిస్ హెచ్ఎల్ దత్, దర్శన్ ఆర్ఎన్, గుజరాత్ నుంచి డాక్టర్ అదిత్ దేశాయ్, మహారాష్ట్ర నుంచి సౌరబ్ హెచ్ బోరా, తమిళనాడు నుంచి కృష్ణమూర్తిని నియమించారు. కాగా ఈ జాబితాపై టీడీపీలో చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమకు కచ్చితంగా బోర్డులో అవకాశం దక్కుతుందని భావించిన చాలామందికి నిరాశే ఎదురవడంతో వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక వడపోతలు, సమీకరణలు పరిశీలించి చంద్రబాబు ఈ జాబితా రూపొందించినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత టీటీడీ బోర్డును నియమిస్తుండడం విశేషం.

సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు, ఇతర పాలకమండలి సభ్యులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.



సుచిత్ర ఎల్లా : భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కో చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కోవిడ్ టీకా కోవాగ్జిన్ రూపొందించినందుకు గాను ఆమెకు, ఆమె భర్త, ఆ సంస్థ సీఎండీ కృష్ణా ఎల్లాకు భారత ప్రభుత్వం 2022లో పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. సుచిత్ర స్వస్థలం తమిళనాడులోని తిరుత్తణి. కానీ తెలంగాణ కోటాలో ఆమెను టీటీడీ బోర్డు మెంబర్ పదవి వరించింది.



ఆనంద్ సాయి

తెలుగు చలనచిత్ర రంగంలో కళాదర్శకుడిగా మంచి గుర్తింపు సంపాదించిన ఆనంద్‌సాయి జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితుడు. పవన్‌కళ్యాణ్ నటించిన పలు చిత్రాలకు ఆయన కళాదర్శకుడిగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లాలో చిన జీయర్‌స్వామి ఆశ్రమ రూపకల్పనలో పాల్గొన్నారు. అనంతరం యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణం కోసం ఆర్కిటెక్ట్‌గా నియమితులయ్యారు. పవన్‌కళ్యాణ్ సూచనతో టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అవకాశం దక్కింది.



బొంగునూరి మహేందర్‌రెడ్డి

హైదరాబాద్ శివారులోని కొంపల్లికి చెందిన బొంగునూరి మహేందర్ రెడ్డి కూడా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు సన్నిహితుడు. ఆ పార్టీ ఆవిర్భావానికి ముందు నుంచే ఆయన పవన్‌తో కలిసి నడుస్తున్నారు. తొలుత ప్రజారాజ్యం పార్టీలో కొనసాగి, జనసేన ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు పవన్ సూచన మేరకు ఆయనకు టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అవకాశం దక్కింది.



నన్నూరి నర్సిరెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా సిరిపురం గ్రామానికి చెందిన నర్సిరెడ్డి ముందునుంచి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా ఉంటూ చంద్రబాబుకు సన్నిహితుడిగా ముద్ర పడ్డారు. టీఎన్ఎస్ఎఫ్‌తో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

జిల్లా వార్తలు

అమరవీరుల వారోత్సవాలకు సిద్ధం

- రేపటి నుంచి సీపీఐ(ఎంఎల్) గ్రూప్‌ల ఆధ్వర్యాన సన్నాహాలు
- తొలినాళ్లలో బలమైన వర్గం.. ఆపై చీలికలు
- ఐదు సార్లు ఇల్లెందు ఎమ్మెల్యే స్థానం కైవసం

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్)లోని వివిధ వర్గాల ఆధ్వర్యాన శుక్రవారం నుంచి నవంబర్ 9వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాస్‌లైన్(ప్రజాపంథా)తో పాటు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలోని వై.కే., చంద్రన్న వర్గాలు ఇందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అయితే, సాధినేని వెంకటేశ్వరరావు సారథ్యాన కొనసాగుతున్న వర్గం వై.కే వర్గంలో విలీనం అయ్యేందుకు సిద్ధమైంది. ఫలితంగా ప్రజాపంథా, వై.కే., చంద్రన్న వర్గాల నేతృత్వాన అమరవీరుల వారోత్సవాలు జరగనున్నాయి.

ప్రజలు, కూలీల సమస్యలపై పోరాటం

చంద్ర పుల్లారెడ్డి నాయకత్వాన 1967లో సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యాన సాయుధ దళాలను ఏర్పాటు చేసి గోదావరి పరీవాహక ప్రాంతంలో కూలీ రేట్లు, తునికాకు కూలీలు, పోడు రైతుల సమస్యలపై ఉద్యమం చేపట్టారు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం నక్సల్స్‌పై ఉక్కుపాదం మోపింది. కాగా, పార్టీ ముఖ్యనేతలు చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, పోట్ల రామనర్సయ్య, నీలం రామచంద్రయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసం, జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, చేరాలు తదితరులు వేర్వేరు సంవత్సరాల్లో నవంబర్ నెలలోనే అసువులు బాసారు. దీంతో ఏటా నవంబర్‌లో అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.



కాచనపల్లిలోని అమరుల స్మారక స్థూపం

బలమైన ఉద్యమం

సీపీఐ(ఎంఎల్) నేతృత్వాన 1980 ప్రాంతంలో బలమైన ఉద్యమం ఏర్పాటైంది. ఇల్లెందు అసెంబ్లీ స్థానాన్ని ఐదు సార్లు, సిరిసిల్ల సీటును ఒకసారి కైవసం చేసుకుంది. 1984లో ఎంఎల్ పార్టీలో చీలికలు రాగా రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఇల్లెందు ఏరియాలో ప్రజాపంథాగా, ములుగు ఏరియాలో విమోచనగా పనిచేశాయి. ఆపై 1988లో విమోచనలో మరో చీలిక సంభవించింది. దీంతో రామచంద్రన్ – కూర రాజన్న విమోచన వర్గంగా, ఫణిబాగ్చీ– మధుసూదన్‌రాజ్ ప్రతిఘటన వర్గంగా కార్యకలాపాలు మొదలుపెట్టారు. విమోచన వర్గం సిరిసిల్ల కేంద్రంగా పనిచేసి ఎన్వీ.కృష్ణయ్యను ఎమ్మెల్యేగా గెలిపించుకుంది. కొంత కాలానికి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది వర్గాలు కలిసి జనశక్తిగా ఆవిర్భవించాయి. ఇక ప్రతిఘటన వర్గంలో చలమన్న నాయకత్వాన ప్రజాప్రతిఘటన, ఆందులో నుంచి గోదావరిలోయ ప్రజాప్రతిఘటన వర్గాలు ఏర్పడ్డాయి. కొంత కాలానికే ఆ గ్రూపులన్నీ అంతరించిపోయి ప్రతిఘటన ఒక్కటే మిగిలింది. అయితే ఆ తర్వాత ప్రతిఘటనలో మళ్లీ రెండు, మూడు గ్రూపులు ఏర్పాటయ్యాయి. జనశక్తి నుంచి ఒక వర్గం సీపీయూఎస్ఐ, ఆదివాసీ లిబరేషన్ ఫ్రంట్‌గా ఏర్పడినా ఆ తర్వాత కనుమరుగమయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు ఆవునూరి మధు (ఫైల్)

కీలక నేతల మరణం

ఈ ప్రాంతంలో కీలక నేతలైన చంద్ర కృష్ణమూర్తి(ఎల్లన్న) సుభాష్‌చంద్రబోస్(రవి), పూనెం లింగయ్య (లింగన్న), ముక్తార్‌పాషా, రాయల చంద్రశేఖర్ కన్నుమూయడంతో పార్టీ తీవ్ర నష్టాన్ని చవిచూసింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న మూడు గ్రూపులకు చెందిన రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య, ఆవునూరి మధు, అశోక్ అమరవీరుల సభలను జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో ఇటీవల జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, జె. సీతారామయ్య, తుపాకుల నాగేశ్వరరావు అమరవీరుల వారోత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నాయకులు గౌని నాగేశ్వరరావు, తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి, మోకాళ్ల రమేష్, కొండపల్లి శ్రీనివాస్ ఇర్పా రాజేష్ పాల్గొన్నారు.

118 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: ఒడిశా రాష్ట్రం నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య వెల్లడించారు. భద్రాచలంలోని కూనవరం రోడ్డులో అధికారులు వాహన తనిఖీ చేపట్టగా రెండు ఆటోల్లో తరలిస్తున్న 118 కిలోల ఎండు గంజాయి దొరికింది. ఆటోల్లో ఉన్న ముగ్గురిలో ఇద్దరు పారిపోగా, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.30 లక్షల వరకు ఉంటుందని జానయ్య తెలిపారు. సమావేశంలో ఎస్ఐ గౌతమ్, ఉద్యోగులు రామకృష్ణ గౌడ్, హబీబ్ పాషా, వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి ఉద్యోగాల నోటిఫికేషన్ అవాస్తవం'

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఓసీల్లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నోటిఫికేషన్‌లో నిజం లేదని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) శామ్యూల్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను పత్రికల ద్వారా ప్రకటిస్తామే తప్ప సోషల్ మీడియాలో విడుదల చేయమని చెప్పారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న నోటిఫికేషన్ అంశాన్ని నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని సూచించారు. ఇప్పటికే ఈ అంశంపై సింగరేణి విజిలెన్స్ విభాగం విచారణ చేపడుతోందని జీఎం తెలిపారు.

యంత్రాల వాడకం అంతంతే..



భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి వినియోగించే ఎస్‌డీఎల్ యంత్రం

- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం
- గతంలో రోజుకు 10.7 గంటల మేర ఎస్‌డీఎల్ యంత్రాలతో పని
- ఇప్పుడు నగటున 6.7 గంటలకే పరిమితం
- నానాటికీ తగ్గుతున్న బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. ఫలితంగా 24 గనుల్లో ఎక్కడ కూడా 100 శాతం ఉత్పత్తి నమోదు కాక వార్షిక లక్ష్యాల సాధన సాధ్యం కావడం లేదు. దీంతో సంస్థకు రూ.కోట్లలో నష్టం ఎదురవుతోంది. సింగరేణి పరిధిలోని భూగర్భ గనుల్లో 26 వేల మంది కార్మికులు పనిచేస్తుండగా.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 59.31 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైంది. అదే 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో 8 వేల మంది కార్మికులే ఉండగా.. 640 లక్షల టన్నులకు పైగా ఉత్పత్తి వచ్చింది.

ఎస్‌డీఎల్ ద్వారా అంతంతే..

సింగరేణి సంస్థలో మొదట తట్టాచెమ్మాస్ విధానం అమల్లో ఉండగా కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా 2002–03లో సైడ్ డిశ్చార్జ్ లోడర్ (ఎస్‌డీఎల్) యంత్రాలను ప్రవేశపెట్టారు. అయితే, కార్మికులకు నామమాత్రపు శిక్షణే ఇచ్చినా ఆరంభంలో రోజుకు 100 టన్నుల ఉత్పత్తి నమోదైంది. ఆ తర్వాత కార్మికులకు విదేశాల్లో శిక్షణ ఇప్పించడంతో రోజుకు 142 టన్నుల ఉత్పత్తి సాధించగలిగారు. కానీ ఇప్పుడు రోజుకు 102 టన్నులకు మించి ఉత్పత్తి రాకపోవడం గమనార్హం. సింగరేణిలోని 24 భూగర్భగనుల్లో 18 గనుల్లోనే ఎస్‌డీఎల్ యంత్రాలు నడుస్తుండగా. మిగతా వాటిలో సీఎమ్మార్, లాంగ్‌వాల్ యంత్రాలతో ఉత్పత్తి సాగుతోంది. ఎస్‌డీఎల్‌లు గతంలో సగటున రోజుకు 10.7 గంటలు పనిచేసేవి. ప్రస్తుతం 6.7 గంటలకే పరిమితమైంది. వీటి పని గంటలు కనీసం మరో రెండు గంటలు పెంచగలిగితే మరో 30 టన్నుల మేర బొగ్గు ఉత్పత్తి చేయొచ్చని, తద్వారా నష్టాన్ని అధిగమించొచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఎంవీటీసీల్లో శిక్షణ కరువు

సింగరేణిలోని ప్రతీ ఉద్యోగికి శిక్షణ ఇచ్చేందుకు మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లను ఏర్పాటుచేశారు. గనుల్లోని ప్రతీ యంత్రం పనితీరు, మరమ్మతులకు సంబంధించి ఈ కేంద్రాల్లో నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించేవారు. అయితే, ప్రస్తుతం ఒకటి, రెండు సెంటర్లు మినహా మిగతా చోట్ల నిపుణులు లేక శిక్షణ సాఫీగా సాగడం లేదు. అంతేకాక సర్వీస్ ఉద్యోగం కావాలని వస్తున్న కొందరు అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ అందడం లేదని చెబుతున్నారు. ఇకనైనా యంత్రాల పని గంటలు పెరిగేలా అధికారులు పర్యవేక్షిస్తే తప్ప భూగర్భగనుల్లో ఆశించిన స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధ్యం కాదని పలువురు పేర్కొంటున్నారు.

గత కొన్నేళ్లలో ఎస్‌డీఎల్ పని గంటలు, ఉత్పత్తి (సగటున)

సంవత్సరం	పని గంటలు	రోజువారీ ఉత్పత్తి (టన్నుల్లో)
2013-14	8.4	108
2014-15	7.9	107
2015-16	7.8	109
2016-17	7.8	114
2017-18	7.9	104
2018-19	7.6	105
2019-20	7.3	107
2020-21	5.6	79
2021-22	6.7	102
2022-23	7.0	105
2023-24	6.7	102



యంత్రాల పనిగంటలు పెంచాలి

ఉద్యోగులు పనితీరు మార్చుకుని యంత్రాల వినియోగాన్ని పెంచితే ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. లేనిపక్షంలో కంపెనీ మనుగడ కష్టతరమనే విషయాన్ని అందరూ గుర్తించాలి. భూగర్భ గనుల్లో ఎల్‌హెచ్‌డీలు, ఎస్‌డీఎల్ యంత్రాల పనిగంటలు పెంచాలి. అప్పుడే 100శాతం ఉత్పత్తి సాధ్యమవుతుంది. – వెంకటేశ్వరరెడ్డి, సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)

లేఖ రాయండి.. బహుమతి పొందండి!

- పోస్టల్ శాఖ ఆధ్వర్యాన లెటర్ రైటింగ్ పోటీలు
- విజేతలకు నగదు బహుమతి
- డిసెంబర్ 14 పోటీలకు తుది గడువు



ఖమ్మంగాంధీచౌక్: లేఖ రాయడాన్ని ఈ తరం మరిచిపోయినా పాత తరం వారికి మాత్రం ప్రత్యేక అనుభవం. ప్రేమ, భావాల అందాన్ని ప్రదర్శించే లేఖా రచనలో భారత తపాలా శాఖ 'ధాయ్ అఖర్' పేరిట పోటీలు నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో 'రచనానందం, డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యత' అంశంపై తెలుగు, హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లో లెటర్ రాయొచ్చు. ఇంగ్లిష్‌లో The joy of writing: Importence of letters in a Digital Age అంశంపై లెటర్ రాయాల్సి ఉంటుంది.

రెండు కేటగిరీల్లో..

లెటర్ రైటింగ్ పోటీలను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తున్నారు. 18ఏళ్ల లోపు ఒక కేటగిరీగా, ఆపై వయస్సు కలిగిన వారిని రెండో కేటగిరీగా పరిగణిస్తారు. మొదటి కేటగిరీ వారు ఇన్‌లాండ్ లెటర్‌లో, రెండో కేటగిరీ వారు ఎన్వలప్ వినియోగించాలి. ఇన్‌లాండ్ లెటర్‌లో 500 పదాల లోపు రాయాల్సి ఉంటుంది. ఇక రెండో కేటగిరీ వారు ఏ–4 సైజు పేపర్‌లో వెయ్యి పదాల లోపు లేఖ రాసి కవర్‌లో పెట్టి పంపించాలి. లెటర్లను 'చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్' చిరునామాకు డిసెంబర్ 14 లోగా చేరేలా ఉంటుంది.

జాతీయ, సర్కిల్ స్థాయిలో బహుమతులు

లెటర్ రైటింగ్ పోటీల్లో విజేతలకు తపాలా శాఖ బహుమతులు అందిస్తుంది. జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు ఇస్తారు. ఇక సర్కిల్ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇవ్వనున్నారు.

గతంలో పలువురు విజేతలు

తపాలా శాఖ గతంలో నిర్వహించిన లెటర్ రైటింగ్ పోటీల్లో ఖమ్మంకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 2022–23లో నిర్వహించిన పోటీల్లో 18ఏళ్ల లోపు విభాగంలో కె.జస్విత(శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఖమ్మం), ఓ.ఉమామహేశ్వరి(జెడ్పీహెచ్ఎస్ బల్లేపల్లి) ద్వితీయ బహుమతిగా రూ.10 వేల చొప్పున సర్కిల్ స్థాయిలో గెలుచుకున్నారు. 18ఏళ్లకు పైబడిన విభాగంలో సర్కిల్ స్థాయిలో గోల్కొండ భావన(ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఖమ్మం) ద్వితీయ బహుమతిగా రూ.10వేలు గెలుచుకోగా, యలమద్ది సుచి(ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఖమ్మం) తృతీయ బహుమతిగా రూ.5వేలు గెలుచుకున్నారు. ఇక 2023–24లో 18 ఏళ్ల లోపు ఎన్వలప్ విభాగంలో బి.ఆరాధ్య(త్రివేణి టాలెంట్ స్కూల్, ఖమ్మం) ప్రథమ బహుమతి రూ.25 వేల నగదు గెలుచుకోవడం విశేషం.



పోటీలు ఓ సదవకాశం..

లెటర్ రైటింగ్ పోటీలు విద్యార్థులు, యువతకు సదవకాశం. పోటీల్లో విజేతలుగా నిలిచే వారికి తపాలా శాఖ జాతీయ సర్కిళ్ల స్థాయిలో నగదు బహుమతులు అందిస్తుంది. మరిన్ని వివరాలకు సమీప తపాలా కార్యాలయంలో సంప్రదించవచ్చు. లేదంటే www. indiapost.gov.in వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.

– వీవీరభద్రస్వామి, పోస్టల్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్